కథానిక

# నిందితుడి వాఙ్మూలం

కిళాంబి కృష్ణమాచార్య

ప్రభువులకు దణ్ణంపెట్టి మనవి చేసుకుంటున్నా. న్యాయాన్యాయాలు కనిపెట్టటానికి న్యాయప్రభువులకు సాటి ఏవరూ లేరు. కాలయాపన చేస్తున్నానని కోర్టువారు ఆగ్రహించవద్దు. నే చెప్పదల్చుకున్న మూడు ముక్కలూ త్వరగా చెప్పేసి ముగించేస్తా. ఈ నిర్భాగ్యుడి జీవిత చరిత్ర సమగ్రంగా చిత్రించి తీర్పుదయ చెయ్యాలనే నా ఆఖరు కోరిక.

నా జీవిత చరిత్ర ఒక విషాదగాథ. నేనిట్లా అవటానికి కారకు లెవ్వరో దొడ్డదొరలే నిర్ణయించాలి. అసలు మా గ్రామం బుడంపాడు. మాదీ ఒకప్పుడు మంచిధనవంతమైన కుటుంబమే. కాని ఓడలు బండ్లు, బండ్లు ఓడలు మాదిరిగా పరిస్థితులు తారుమారయ్యాయి. నేను సంసారం చక్కబెట్టుకోవడానికి వచ్చేటప్పటికి వున్న కాస్త ఆస్థిపాస్తులు అప్పులవాళ్ల పాలయ్యాయి. తినడానికి తిండీ, కట్టుకోడానికి గుడ్డా లేక చాలా బాధలు పడ్డాము. చిన్నపుడు నాలుగు అక్షరం ముక్కలు నేర్పించారు. కాని వాటిని బావగా చేసుకొని ఈ దారిద్ర్య సముద్రాన్ని దాటటానికి ఏమాత్రమూ వీలుగాకపోయింది. పోనీ, కాయకష్టం చేసికొని కుటుంబాన్ని పోషించుకుందామంటే నేనంత బలంగాలేననీ కూలీనాలీ చేయడానికి పనికిరాననీ నన్నెవరూ పెట్టుకోలేదు. రోజురోజుకూ మా కుటుంబం ఆర్థికంగా బలహీనస్థితికి వచ్చింది. 'దరిద్రుడికి ఆక లెక్కువ, నిర్భాగ్యుడికి నిద్ర ఎక్కువ' అన్నట్లు మా పిల్లలెప్పుడూ 'ఆకలి ఆకలని' నన్ను ఏడిపించేవాళ్లు. అన్నట్లు మనవి చేయటం మరిచిపోయినా! మాయింటినిండా గంపెడు పిల్లలు. కీళ్లరోగంతో మంచంమీదవున్న తల్లి, రోగి భార్య, ఇంక నా అగచాట్లు భరింప శక్యముగాక పోయినాయి.

ఒక్క నాట్ల రోజుల్లోనూ, కోతల రోజుల లోనూ అడపాతడపా నాల్గుడబ్బులు దొరికేవి. వాటినిబట్టి నాలుగురోజులపాటు భుక్తి గడిచేది. ఆ కొద్దిపాటి సంపాదన కర్చవగానే మళ్లా మామూలు ధోరణే. పిల్లలంతా ఆకలి బాధతో రాత్రంతా కొట్టినట్లు లేచి కూర్చుని రాగాలు సాగించేవారు. నాకు నేనెంత కష్టపడుతున్నా అంతబాధ అనిపించేది గాదు. "అయ్యా! అన్నం పెట్టించవూ" అని హృదయాన్ని కరిగించే పిల్లల ఆర్తనాదం వింటే ఆత్మహత్యయైనా చేసుకుందామా అని అనిపించేది.

అనవసర ప్రసంగం చేస్తున్నానని ఆగ్రహించవద్దని ప్రభువులకు నా మనవి. ఈ పోలీసువారు నేను మళ్లా రెండోమాటు దొంగతనం చేశాననీ, అందువల్ల నాకు ఎక్కువ శిక్ష విధించమనీ కోరుతున్నారు. నేను మొదటిమాటు ఎందుకు దొంగతనం చేయవలసి వచ్చిందో మనవి చేసికొంటున్నా.

కూలికోసం రోజంతా తిరిగి విసిగి వేసారి కాళ్లీడ్చుకుంటూ సాయంకాలం గుడిసె చేరాను. మా మూడేళ్ళపిల్ల గుక్కపెట్టి ఏడుస్తోంది. తనకు ప్రొద్దుటనుంచీ అన్నము పెట్టలేదనీ అందువల్ల తనకు శోష వస్తోందనీ చెప్పి భోరున ఏడువసాగింది. ముసలి తల్లి మూల్గుతూ నులకుక్కిలో పడుకుంది. ప్రొద్దుటనుంచీ ధారకం దిగటంలేదని తెలిసింది. ఇల్లాలు మరోమూల చెంగువేసుకుని పడుకుంది. బయటవాన క్షోణీపాతముగా కురుస్తోంది. గాలి రివ్వున తీస్తోంది. గుడిసెమీద తాటాకులు గాలికి లేచిపోతున్నాయి. గుడిసెమీది ఆకులు ఎగిరిపోకుండా నాలుగురాళ్లు బరువు పెట్టి క్రిందకు దిగివచ్చాను. నన్ను చూడగానే మాపిల్ల మళ్లా మారాము సాగించింది. "అయ్యా ప్రొద్దుటే నీవు బయటికి వెళ్ళి అన్నం తెనొచ్చావు. మరి నాకు ఆకలివేస్తోంది అయ్యా" అని వెక్కి వెక్కి ఏడ్వసాగింది. తడిసిపోయిన బట్టలతో గుడిసె బయటకొచ్చాను. ఆకాశం

అంతా ఉరుములు మెరుపులతోటి చాలాభయంకరంగా వుంది. పిల్లల బాధను చూడలేక ఎల్లాగైనా ఆరోజు కొంత అన్నం సంపాదించి కన్నబిడ్డలకు పెట్టి వాళ్ళ ప్రాణాలను కాపాడి తీరాలని కృతనిశ్చయుండనైనాను.

ఎదురుగా వున్న దుకాణంలో దీపము మిణుకు మిణుకు మంటోంది. ఆశాజ్యోతి నాలో అంకురించింది. త్వరగా పరుగెత్తుకుంటూ వెళ్ళి పిల్లలు ఆకలిబాధతో నకనక లాడుతున్నారనీ, ఏదో ఒక తినుబండారము అప్పుయిచ్చి నోరులేని బిడ్డల ప్రాణాలు కాపాడమనీ దుకాణదారుని రెండు పాదాలనూ నా కన్నీటితో కడిగివేసాను. అతడి విశాలహృదయం చలించలేదు. నేను చేసే పని తప్పని ఎంతమాత్రం అనుకోలేదు. పిల్లల ప్రాణరక్షణయే నా ప్రథమ కర్తవ్యమని తలచి ఒక రొట్టెముక్కను బలవంతంగా తీసికెళ్ళి నాపిల్లకిచ్చాను. ఒకగంట కాలంగడిచింది. వాన కూడా కొంచెం వెలిసింది. నలుగురైదుగురుపోలీసు నా గుడిసెలో దూరి నా చేతులకు బేడీలు తగిలించి తీసుకుపోయారు. ప్రభూ! ఆరాత్రి నేను పడ్డ మనస్తాపం వర్ణించలేను. నా జీవితంలో అదొక చిత్రసంఘటన. నన్ను జైలులో నానాబాధలూ పెట్టారు. నన్నారోజున కోర్టులో హాజరుపెట్టారు. నేను కేవలం దొంగను కాననీ, అన్నమో రామచంద్రా అని మలమల మాడుతూవుంటే ఏతండ్రి కూడా సహించలేడనీ, నన్ను ఆనాడు దొంగతనానికి ప్రేరేపించినది నన్ను పీల్చి పిప్పి చేస్తున్న దారిద్ర్యమే ననీ, హృదయములేని క్రూర సంఘము కళ్ళకు గంతలు కట్టుకొని నన్ను ఒక మానవమాత్రుడుగా పరిగణించుటకు నిరాకరించినదనీ, నేను బుద్ధిపూర్వకముగా ఏదోషమూ చేయలేదనీ, కేవలం నా బిడ్డల జీవితాలను నిలబెట్టటానికే నేను ఆ రొట్టెముక్కను తీసుకొన్నాననీ, కోర్టు వారికి మనవి చేసుకున్నా. కాని కోర్టువారు దయాదాక్షిణ్యాలులేక, తమకు కారణాలతో నిమిత్తం లేదనీ, నేను దొంగతనం చేసినట్లు రుజువు అయిందనీ తెల్పి నాకు 6 నెలల కఠినశిక్ష విధించారు.

ఆ ఆరు నెలలు ఎల్లాగడిపానో ఆ పరమాత్మునికే ఎరుక. ఆరు నెలలూ ఆరు యుగాల మాదిరి కళ్లు కాయలు కాచేటట్లు ఏడ్చి ఏడ్చి ఎల్లాగో గడపగలిగాను. మంచంబట్టిన ముసలి తల్లి పిడికెడు మెతుకులకోసం అల్లాడుచున్న ఆలుబిడ్డలూ నాకళ్లలో మెసలుతోంటే గుండెలు పగిలిపోయేటట్లు ఏడ్చేవాణ్ణి. నా హృదయం శిలాహృదయం గనుక ఇంకా బ్రతికేయున్నాను.

ఆరు నెలలూ గడిచిపోయాయి. నన్ను జైలు గేటు బయటికి తీసికొచ్చి వదలివేశారు. నేను కేవలం రెక్కలు తెగిన పక్షిమాదిరి నిరాధారుణ్ణి ఐపోయినాను. ఏమి చేయటానికీ పాలుబోలేదు. పిచ్చివానిమాదిరి వీధులెంట పరుగెత్తాను. దారిన పరుగెడుతూంటే నవ్వినవారు నవ్వారు. నన్ను చూసి వుమ్మేసిన వాళ్ళు వుమ్మేసారు.


కొంతదూరం నడిచీ నడిచీ సొమ్మసిలి పడిపోయేవాణ్ణి. తెలివి గలిగినప్పుడల్లా నడక సాగించేవాణ్ణి. కొన్నాళ్లకు మావూరు పొలిమేర చేరుకున్నా. సమీపంలో ఎవరో చెట్టుక్రింద చలిమంట కాచుకుంటున్నారు. వేగంగా అటువైపు పరుగెత్తాను. చలిమంటచుట్టూ నలుగురైదుగురు పిల్లలూ, చినిగిన బట్టలను ధరించి ఎల్లాగో మానాన్ని కాపాడుకోవటానికి ప్రయత్నించే యిద్దరు స్త్రీలను చూసాను. నేను వాళ్ల ప్రక్కనుండి వెళ్ళడంచూచి నన్ను గుర్తుపట్టారు. 'అయ్యా' అని పిల్లలంతా నా చుట్టూ మూగి ఏడ్వసాగారు. 'నాయనా' అని ముసలి తల్లి కంట తడి బెట్టింది. ఆ దృశ్యాన్ని కళ్ళారా చూడటంతోటే నా ఆప్తబంధువుల్ని చూడటంవల్ల కలగవలసిన ఆనందానికి బదులు హృదయం బ్రద్దలయ్యేటట్లు ఏడ్చాను. చివరకు నా పిల్లల్ని కలుసుకున్నా గదా అనే సంతోషమే నాకు లేకుండాపోయింది. ఆ రాత్రంతా నా ఆలుబిడ్డలుపడ్డ అష్టకష్టాలూ వింటూంటే స్మారకం తప్పిపోయినట్లయింది.

* * *

ఆ రోజునుంచీ ఆ చెట్టుక్రిందే మా నివాసం. మర్నాడు వూళ్ళోకి బయలుదేరాను. నన్ను చూసీ చూడటంతోటే వూళ్లో పిల్లలంతా కెవ్వన కేకవేసి తమ తల్లుల్ని కౌగలించుకున్నారు. 'దొంగతనాలు చేయటానికి మళ్ళీ ఈవూరే చేరావా' అని పెద్దలంతా చీదరించు

కున్నారు. ఎచ్చటయినా కూలీనాలీ చేసైనా సంసారము గడుపుకుందామని విశ్వప్రయత్నం చేశాను. ఎవరివద్దకు వెళ్ళి అడిగినా 'దొంగకు వుద్యోగ మేమిట'ని కసిరి కొట్టారు. నేను "దొంగ"నని ముద్రకొట్టినట్లయింది. ఇల్లాగ పది రోజులపాటు ఎండనక వాననక దిమ్మతిరిగాను. నాకు మిగిలిందల్లా కాళ్ళ త్రిప్పట మాత్రమే. నన్ను కూలీగా స్వీకరించటానికి అందరూ నిరాకరించారు. నేను చేసిన అపచారమేమిటో అవగాహన కాలేదు. మళ్ళా యథాప్రకారమే. పట్టెడు మెతుకులకోసం డొక్కలు యెండిపోయిన పిల్లల దుస్థితి చూడలేక పోయాను. ఎంతయినా కన్నకడుపు గదా. ఎవరయినా నన్నుముక్కలుముక్కలుగా ఖండించటానికైనా, నా మనస్సొప్పుతుంది గాని నా పసిపాపలు అకారణంగా క్షుద్బాధ చేత మాడిపోవడానికి నా మనసు పూరుకోలేదు, కాని నేనశక్తుణ్ణి, ఆలుబిడ్డల పోషించలేని అప్రయోజకుణ్ణి. కాని కర్తవ్యం గోచరం కాలేదు. నేనింత బాధపడటానికి కారణం మూర్ఖపు సంఘమేనని స్పష్టపడింది. ఒక వంక తమసౌఖ్యంకోసం, తమ అనుభవంకోసం ధనాన్ని నలలంమాదిరిగా వెదజల్లే మానవులను చూడక పోము. వేరొక వంక కేవలం పిడికెడు మెతుకులకోసం జీవితాలని ధారబోసే మానవులను గూడా చూస్తూనే ఉన్నాం. ఎటుచూచినా నా బిడ్డల్ని పోషించటానికి మార్గం కనపడలేదు. రాను రాను వారి బాధ మరీ విపరీతమైపోయింది.

ఒకరోజు మా ఆఖరుబిడ్డ ఆకటిబాధతోటి శోషబోయింది. రోడ్డు ప్రక్కనుంచి ఒక ఆవు పోతోంది. దాన్ని కట్టేసి కాసిని పాలు పిండి బిడ్డకిచ్చాను. ఇంతలో ఆవు గల ఆసాములు కర్రలు త్రిప్పుకుంటూ కళ్ళవెంట అగ్నికణాలు గురిపిస్తో అక్కడికి వచ్చారు. నేను ఆవునుఎత్తుకుపోయినానని నేరం ఆరోపించారు. మర్నాడు నన్ను అరెస్టుచేసి మీ ఎదుట హాజరుపెట్టారు. జరిగిందంతా విన్నవించుకున్నాను. న్యాయాన్యాయాలు తమరే గ్రహించాలి. నా కన్నబిడ్డల ప్రాణాలను రక్షించటానికి చేసిన పనిని దొంగతనమని అంటున్నారు. నేను చేసినదే దొంగతనమైతే, నన్ను ఖైదులో వుంచినంత మాత్రాన నాకుసంస్కారము గలుగనేరదు. దొంగతనము చేయటానికి ప్రేరేపించే కారణాలను నిర్మూలిస్తేనే గాని నేరాలు తగ్గజాలవు. ఇదే ధర్మప్రభువులకు నా మనవి. నేను నిర్దోషినని మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను.



తయారుచేయువారు
ది మైసూర్ వెజిటబిల్ ఆయిల్ ప్రాడక్ట్స్ లిమిటెడ్, మద్రాసు
MVZ II T6